# దగ్గరకెళ్ళి చూడు

నీలకంఠంతో నాకు పెద్ద పరిచయమేదీ లేదు. నేనెప్పుడు శాస్త్రిని కలవడానికి వాళ్ళ ఆఫీసుకెళ్ళినా నీలకంఠం స్టోరు రూములో చాలా బిజీ బిజీగా కనిపిస్తూంటాడు. నేనతనితో ఎప్పుడూ మాట్లాడకపోయినా అతని గురించి వింటూ ఉంటాను.

అదేదో సామెత చెప్పినట్టు 'ఊరంతటిదీ ఒక దారైతే, ఉలిపికట్టెదొక దారన్నట్టు ఉంటాడని, వాళ్ల ఆఫీసులో చెప్పుకుంటారు. నే వెళ్లినప్పుడల్లా 'రాంబాబూ! ఈ విషయం విన్నావా?' అంటూ అతని గురించి ఏదో విశేషం చెప్పి పగలబడి నవ్వుతారు. ఏ విశేషంలోనిదైనా విషయం అంతకుముందునే విన్నదే. నీలకంఠం పిసినారి. ఏ సరదా లేని మనిషి. నలుగురితొ కలవని ఒంటరి పక్షి. ఆఫీసు స్టాఫ్ సరదాగా చేసుకునే ఏ కులాసా కార్యక్రమంలోనూ పాల్గొనడు. నలుగురితో కలిసి కాఫీయే తాగడు. ఎంత దూరమైనా పాత డొక్కు సైకిల్ మీదే వెళ్తాడు. సినిమాలు, షికార్లు ఉండనే ఉండవు.

ఇవే కావు. మరికొన్ని విషయాలు- నీలకంఠానికి ఆర్థిక స్వాతంత్ర్యం లేదు. జీతం మొత్తం భార్య చేతిలో పోయవలసిందే. ఆమె నెలకిచ్చే పాతికో, ముప్ఫయితోనే తన సాదా ఖర్చులు నెట్టుకురావాలి. అతనికి తల్లీ తండ్రీ ఉన్నారు. కానీ అతని భార్య వాళ్లను వేరు పెట్టేసింది. అతనికి మూడేమూడు జతల బట్టలున్నాయి. బాగా చిరిగిపోయే పరిస్థితికి వస్తే తప్ప.... కొత్త బట్టలు కుట్టించుకోడు. కొందరు మరో విధంగా చెప్తారు. నీలకంఠం బహు కోపిష్టి- ఛాందసుడు. భార్యని ఎక్కడికీ వెళ్లనివ్వడు. వెళ్లాల్సివస్తే వెంటతనూ వెళ్తాడు. ఇలా...

నేనారోజు ఆఫీసుకు వెళ్లేసరికి శాస్త్రి సీటులో లేడు. క్యాంటీన్‌లో నలుగురు కొలీగ్సు మధ్య కూర్చుని సిగరెట్ తగలేస్తూ పగలబడి నవ్వుతున్నాడు. వారి నవ్వుల మధ్య నాకు తెలిసిందేమిటంటే 'నీలకంఠం పెద్ద గ్రంథసాంగుడనీ... వారం రోజులపాటు రాత్రివేళ ఆలస్యంగా ఇంటికి వస్తున్న భర్తను అతని భార్య వీధిలోనే నిలబెట్టి పంచాయితీ పెట్టిందనీ... దానికి ఆఫీసు ప్యూను నారయ్యే సాక్షి- అనీ.

"ఏమిటీ! మనవాడు అంత శృంగార పురుషుడే!" అని దీనదయాళ్ అంటూంటే...

"అతనని వరించిన ఆ వరూధిని ఎవరు చెప్మా!" అని సుధాకర్ శంకిస్తే...

'భార్య సుఖంలేక బయట కక్కుర్తి పడుతున్నాడు కాబోలు.' అని భద్రం సిద్ధాంతం చేస్తే...

'ఏమైనా మనవాడు నిండుకుండ.' అని అందరూ నవ్వుల మధ్య తీర్మానించారు.

నేనూ ఏదో అని నవ్వులు పంచుదును. కానీ నాకు తెలియని వ్యక్తి గురించి

వ్యాఖ్యానించి, వరాయిచోట మాట జారడం సభ్యత కాదనిపించి నోరు మూసుకున్నాను. ఆ నవ్వుల్లో నారయ్య కూడా చేరటం నాకు నచ్చలేదు.

వీరి మాటల్లో కొంత సత్యముండవచ్చు. కొంత వాస్తవం కాకపోవచ్చు. కానీ ఇందరిమధ్య ఎగతాళి కావలసిన కారణమేమిటో నాకర్థం కాలేదు. 'ఇవన్నీ నీలకంఠానికి వినిపించవా? లేక వినిపించుకోడా?' అని కొందరి సందేహం.

నిజానికీ విషయాలేవీ నీలకంఠానికి తెలియవు.

ఆఫీసుకొచ్చిన దగ్గర నుండి వెళ్ళేంతవరకు తెల్లకాగితం, పెన్సిలు, బాల్‌పెన్ దగ్గర నుండి పెద్ద పెద్ద వస్తువుల్ని రిక్విజిషన్ ప్రకారం అందజేయటం, సంతకం తీసుకోవటం, సాయంత్రానికల్లా స్టాకు వెరిఫై చేసుకోవటం, తేడాలు వస్తే డిపార్టుమెంటు చుట్టూ తిరిగి సరిదిద్దుకోవటం... ఇవీ అతని నిత్యకృత్యాలు. లంచ్ టైంలో కూడా బయటికి పోడు. అతనికో ప్యూను ఉంటాడు. పేరు నారయ్య. నారయ్య ఎప్పుడూ అతని దగ్గరుండడు. చీటీలు కట్టించుకునే వ్యవహారం మీద బయటే తిరుగుతూంటాడు. నారయ్యనేమీ అనడు నీలకంఠం. అతని పని కూడా తనే చేస్తూంటాడు.

ఆఫీసు కట్టేసిన తరవాత దగ్గరగా ఉన్న రెస్టారెంటులో మేమంతా శాస్త్రితో లావాదేవీలు, సెటిల్‌మెంట్సు, నిర్ణయాలు, హామీలు చేసుకునేవేళ నీలకంఠం గేటుదాటి వెళ్ళడం చూనస్తూంటాను. 'కాని పనులు' చాలా వాటిని శాస్త్రి చేసిపెడుతుంటాడు. నాకూ సహాయపడుతుంటాడు. ఇరువురికి చెరో కాస్త. నేను ఇతరుల పనులను శాస్త్రి సాయంతో చేస్తుంటా మరి.

ఆ రోజు నేను ఆఫీసు కెళ్ళేసరికి ఆఫీసు కట్టేసేటైమైంది. ధీమాగా రెస్టారెంటు ముందు కెళ్ళబోతూంటే గేటు దాటి ఇవతలికి వస్తూ సైకిల్ టైర్లలో గాలి ఉందో లేదో అని చూసుకుంటున్న నీలకంఠం నన్ను చూసి "శాస్త్రి గారు నాలుగు రోజుల నుంచి ఆఫీసుకు రావటంలేదండి. సెలవు పెట్టారు." అన్నాడు. ఇన్నాళ్లలో మొదటిసారిగా నాతో అతను మాట్లాడిన నాలుగు ముక్కలు అవే.

"అలాగా. నేనర్జంటుగా అతన్ని కలవాలి. ఇంటికెళ్తాను." అన్నాను.

"ఇంట్లో కూడా ఎవరూ లేరు. అందరూ కలిసే వెళ్లారు. ఎప్పుడొస్తారో తెలియదు." అన్నాడు నీలకంఠం ముఖం తుడుచుకుంటూ.

"అరే! నా పని వెనుక పడినట్టే! చాలా ఆశగా వచ్చాను. ఇప్పుడేం చేయడం? పోనీ ఒక పని చేస్తారా? అతను రాగానే ఫోన్ చేస్తారా? ఇదిగో నా నంబరు." అంటూ కార్డు ఇవ్వబోయాను.

– "ప్రయోజనమేదీ ఉండదు. ఎందుకంటే ఆయన ప్రస్తుతం ఎవరి పనీ చేసిపెట్టే పరిస్థితిలో లేరు."

"ఏం? అలా అంటున్నారు. అసలేం జరిగింది?" అడిగాను.

"పదండి నడుస్తూ మాట్లాడుకుందాం." అన్నాడు నీలకంఠం సైకిలు నడిపిస్తూ.

నాకూ చాలా ఆత్రుతగా ఉంది- శాస్త్రి గురించి తెలుసుకోవాలని. అందుకే "పదండి. ఆ హోటల్‌లో కూర్చుని మాట్లాడుకుందాం- కాఫీ తాగుతూ" అన్నాను.

"వద్దులెండి మా ఇంటికి పోదాం. ఇల్లు దగ్గరే. అయినా పదిమంది కూడేచోట మనం కొన్ని విషయాలు మాట్లాడుకోకూడదు." నా ఆత్రుత ఆదుర్ధాగా మారింది.

"పోనీ క్లుప్తంగా చెప్పండి. అసలేం జరిగిందో..."

"అతని సీటు ఎలాంటిదో మీకు తెలుసుగా. ఇంత ఉంటే అంత చేస్తారు. ఎవరో అతని మీద కంప్లయింట్ చేశారు- హెడ్డాఫీసుకి. శాస్త్రి స్వతహాగా మంచివాడే. కానీ సీటు మహత్త్వం. పైవాళ్లకీ కింద వాళ్లకీ ఇవ్వడం కోసం చెయ్యి చాచక తప్పని సీటది. తిన్న వాళ్ళందరూ తప్పుకుంటారు. చివరికితనిలాంటి వారే దొరుకుతారు."

"ఇవ్వడం అలవాటు చేసిన తరవాత- తీసుకోవడం తప్పంటే ఎలాగ?"

"అలవాటు చేసింది మీలాంటివారు కాదా? మాంసం రుచి మరిగిన పులి పళ్ళు తింటుందా? నేనన్నానని అనుకోకండి. పద్ధతి ప్రకారం జరిగే పనికి లంచం ఎందుకు ఇవ్వాలి? ఎవరి ప్రమేయం లేకుండానే నోట్లు చేతులు మారుతున్నాయి. అది సర్వసాధారణమై పోయింది. కానీ ఇచ్చేవాడెవరో, ఇవ్వలేని వాడెవరో కూడా గమనించనక్కరలేదా? చాలలేదని మనుషుల్ని తిప్పించడం... అనవసరమైన ఖర్చులు మన సరదాల కోసం వాళ్ళ నెత్తిన రుద్దడం... ఇవన్నీ ఆనందించదగ్గ విషయాలేనా?" అతను నెమ్మదిగా మాట్లాడుతున్నా- నాకెందుకో ఇబ్బందిగా ఉంది. నేను మౌనం వహించాను.

"కంప్లైంట్ చేసిన వారెవరో తెలియనివారు కారు. ఇతనిచేత బాగా లాభపడినవారో... ఈ దాహాన్ని ఇంకా తీర్చలేమనుకున్నవారో... ఇతని సీటును హస్తగతం చేసుకుందామనుకున్నవాళ్ళో ఈ పని చేసి ఉండాలి. కాదంటారా?"

"కావచ్చు." అన్నాను.

నీలకంఠం దారిలో ఇంటికి కావలసిన వస్తువులు రెండు మూడు కొన్నాడు.

"నేనిక బస్సుకి వెళ్తాను." అన్నాను.

"కాఫీ తాగి వెళ్దురుగానీ... పక్క వీధిలోనే మా ఇల్లు. ఆఫీసుకు దగ్గరే." అన్నాడు.

ఏ పరిచయంలేని నేను, అతనింటికెళ్ళి, అతని అతిథ్యం స్వీకరించడం నాకెందుకో ఎబ్బెట్టుగా అనిపించింది. కానీ అతనలా బలవంతం చేస్తూంటే కాదనలేకపోయాను.

అది నాలుగు వాటాలుగా ఉన్న ఇంటిలో మూడు గదుల పోర్షన్. ఇల్లు కట్టి చాలా కాలమైనట్టుంది. అద్దె తక్కువని అందులో ఉంటున్నాడని గ్రహించాను.

మేము వెళ్ళేసరికి వీధి వరండాలో అయిదుగురు పిల్లలు పుస్తకాలు

ముందేసుకుని చదువుకుంటున్నారు.

నీలకంఠం పిల్లల్ని పరిచయం చేశాడు.

"వీడు మా అబ్బాయి... ఇది మా అమ్మాయి..." అంటూ ఏడు, అయిదు సంవత్సరాల పిల్లల్ని చూపాడు.

"వాడు మా అన్న కొడుకు... టెన్తుచదువు తున్నాడు- నా దగ్గరే ఉండి. వాళ్ళ ఊళ్ళో చదువు సదుపాయం అంతంగా లేదు. ఇది మా పెద్దక్క కూతురు, నైన్తు; ఇది మా చెల్లెలి కూతురు, ఎయిత్; వాళ్ళవి హిందీ చదువులు. అందుకని చిన్న క్లాసుల నుండి నా దగ్గరే ఉండి చదువుకుంటూ ఇంతవరకు వచ్చారు" అని అతను పరిచయం చేస్తూంటే వాళ్ళు వినయంగా లేచి నిలబడి నాకు నమస్కారాలు చేశారు. ఎంతో ముచ్చటేసింది. నాకూ ఇద్దరు పిల్లలున్నారు. అమ్మాయి, అబ్బాయి... వాళ్ళు వాళ్ళ గురువులకే నమస్కరించరు. ఇంక ఇంటికొచ్చే పెద్దలకా? ఒట్టి మాట. ఎవరు వచ్చినా వారి ధ్యాస వారిదే! సోఫాలు దిగరు. టీవీ కట్టరు. వీళ్ళెందుకిలా ఉన్నారు. మరి వాళ్ళెందుకలా ఉన్నారు' అని నేను ఆలోచిస్తూంటే నీలకంఠం లోపలికి వెళ్ళి వచ్చాడు. అందరిలో పెద్దబ్బాయి నీలకంఠం దగ్గరకెళ్ళి నెమ్మదిగా "చిన్నాన్నా! నోటు పుస్తకాలు కొనుక్కోగా మిగిలిన డబ్బులివిగో. అందరికీ తలో నాలుగు పుస్తకాలొచ్చాయి. క్రితంసారి షాపతను మనకు పది రూపాయలివ్వాలి. వాటితో రబ్బర్లు, పెన్సిళ్లు కొనుక్కున్నాం.. అందరం పంచుకున్నాం." అన్నాడు.

"పేర్లు రాసిపెట్టవా మావయ్యా." అందో అమ్మాయి.

"ఈ మావయ్య గారితో మాట్లాడుతున్నాను కదమ్మా. శేఖర్ రాస్తాడులే." అన్నాడు నీలకంఠం. శేఖర్ అందరి నోటుపుస్తకాలు ముందేసుకుని వాళ్ళవాళ్ళ పేర్లు అందంగా రాయసాగాడు. ఎవరో పిలిస్తే ఆడపిల్లలు లోపలికెళ్ళారు. ఒకమ్మాయి మా ముందు టీపాయి లాంటి చిన్న బల్ల వేసింది. ఇంకో అమ్మాయి మంచినీళ్ళ గ్లాసులు పెట్టింది. అందరికన్నా పెద్దమ్మాయి ప్లేట్లలో వేడివేడి పెసరట్లు తెచ్చి పెట్టింది. "తీసుకోండి... చల్లారిపోతాయి." అన్నాడు నీలకంఠం. వాళ్ళను చూస్తే నాకెంతో ముచ్చటేసింది. ఈ క్రమశిక్షణ ఎవరు నేర్పితే వస్తుంది? అసలు నేర్పేదెలా? బజారులో కొద్దిపాటైనా దొరికితే బాగుండును. కొనుక్కొని మా పిల్లలకు పంచుదును.

నీలకంఠం భార్య లోపలినుండి వస్తూ మాకు చెరో కప్పులో టీ తెచ్చింది.

నీలకంఠం తన భార్యను పరిచయం చేస్తూ "శారదా! ఈయన మన శాస్త్రి గారి స్నేహితులు. పనిమీద వచ్చారు." అన్నాడు.

ఆమె నవ్వుతూ నమస్కరించి "అలాగండీ! వాళ్లదీ మాదీ ఒకే ఊరు. అతని భార్య నాకు చెల్లెలి వరస. చాలా మంచివాళ్ళు." అంది.

ఆమె సౌమ్యత నన్ను ఆకట్టుకుంది. వెంటనే సిగ్గుకూడా వేసింది. ఇలాంటి దంపతుల గురించా... నలుగురూ జోకులేసుకుని నవ్వుకుంటూ ఉంటే పాలుపంచుకున్నానని బాధవేసింది.

టీ తాగడం అయిన తరవాత ఇంటిలోకి తీసుకెళ్ళి చూపించాడు. వీధి వరండా వెనుక వరసగా మూడు గదులు. వెనక గదే వంటిల్లు. గదులంత పెద్దవేమీ కావు. ఇంట్లో రెండు నవారు మంచాలు, రెండు చెక్క బీరువాలు, నాలుగు సాదా కుర్చీలు... ఇంకా చిన్నచిన్న వస్తువులు తప్ప మరేమీ లేవు. వంటింట్లో గ్యాస్ స్టౌ తప్ప- టీవీ, ఫ్రిజ్, సోఫాలు, డైనింగ్ టేబుల్స్, డబుల్ కాట్స్, సింగిల్ కాట్స్ ఏవీ లేవు.

మా ఇంట్లో అన్నీ ఉన్నాయి. మామూలు ఫోనే కాదు, సెల్‌ఫోనూ ఉంది. నాకు స్కూటరు... మా అమ్మాయికి సన్నీ... క్రెడిట్‌కార్డు ఉన్నాయి. నగలు మార్చి కొత్త నగలు చేయించటం, కొనటం- నా శ్రీమతికి హాబీ. హాబీగానే షాపింగ్- కొత్త చీరలు కొనటం మామూలే! మేము చేసే నెలవారీ ఖర్చు ఒక సాధారణ కుటుంబాన్ని సులభంగా పోషించగలదనిపించింది నాకు.

"ఇంత చిన్న ఇంటిలో ఇంతమంది ఉంటున్నారా?" ఆశ్చర్యంగా అడిగాను.

"మేమే కాదు... మా అమ్మా నాన్నా పండుగలకీ కార్యాలకీ వస్తూంటారు."

"అవును... వాళ్ళిక్కడ లేరా?

"ఓ నాలుగు వీధుల అవతల- డాక్టరు రావుగారి హాస్పిటల్ దగ్గర ఇంటిలో మా అమ్మా నాన్నా ఉంటున్నారు. నాన్నకి బి.పి., షుగరు. డాక్టరు సదుపాయం ఉంటుందని అక్కడ వేరే ఇల్లు అద్దెకు తీసుకుని ఉంచాను. డాక్టరుగారు రోజూ చూసి వెళ్తారు. ప్రతిరోజూ నేను ఆఫీసుకి, పిల్లలు స్కూళ్ళకి వెళ్ళిన తరవాత శారద క్యారియర్‌లో వాళ్ళకి భోజనం తీసుకెళుతుంది. మధ్యాహ్నం వరకు ఉండి వచ్చేస్తుంది. రాత్రికి ఇద్దరూ రొట్టెలు తింటారు. కాసేపాగి నేను వాళ్ళకి గోధుమ రొట్టెలు, వాళ్ళకు కావలసిన మందులు ఇచ్చేసి కొద్దిసేపుండి వస్తాను. వాళ్ళ ఆరోగ్య పరిస్థితినిబట్టి ఒక్కొక్కప్పుడు రాత్రిళ్ళు ఉండిపోవలసి వస్తుంది. పిల్లలకు బడులు దగ్గరని ఇక్కడ మేము... డాక్టరు దగ్గరని అక్కడ వాళ్ళు". అన్నాడు నీలకంఠం.

"అయితే రెండు సంసారాలు... చాలా కష్టమే!" అన్నాను.

"కష్టమని ఎవరిని నిర్లక్ష్యం చేయగలం? పిల్లలు పెరిగే మొక్కలు. వీళ్ళను చూడక... చదువు చెప్పించక మానగలమా? చదువుకుంటేనే కదా వాళ్ళు రేపు ప్రయోజకులయ్యేది. ఇక వాళ్ళు పెంచి- నీడనిచ్చిన వృక్షాలు. వాళ్ళ నీడే కదా మనల్ని కాపాడుతున్నది... ఆశ్రయం ఇచ్చింది. వాళ్ళను వదులుకోవడం న్యాయంకాదుగా..."

"నిజమే మరి." అనక తప్పలేదు నాకు, మా నాన్న పోయిన దగ్గర్నుండి నాలుగేళ్ళుగా మూడేసి నెలల చొప్పున మగ్గంలో కండె మాదిరిగా మా అమ్మ తిరగడం నేను ఎరగనిది కాదు.

"కానీ మీకొచ్చే జీతం- ఇంత పెద్ద సంసారానికి సరిపోతుందా?"

ఆర్థిక అవసరాలు మనిషిని ఎటు నెట్టుకుపోతాయో నాకు తెలుసు కాబట్టి నేనా ప్రశ్న వేయక తప్పలేదు. "సరిపోవడానికి అంతేముంది? ఉన్నంతలో

సర్దుకుంటాం. తప్పదు కదా."

"చూడండి నీలకంఠంగారు! మీలా ఉన్నదానితో సరిపెట్టుకోవడానికి అనువైన కాలం కాదిది. భార్యాభర్తలు సంపాదించినా సరిగా నడవని కుటుంబాలెన్నో ఉన్నాయి. ఒకరి సంపాదనతో సంసారాలు నడిచేదెలా? మీలాగా త్యాగం చేయగలవారెందరు?"

"త్యాగం అనకండి... అది నా బాధ్యత. అవసరాలు ప్రతివారికీ ఉంటాయి. కాలంతోపాటు పెరిగేవి కొన్నైతే.. అనవసరమైనవి కొన్ని. పందిరి మంచాలు, పట్టు పరుపులు, టీవీలు, ఫ్రిజ్‌లు అవసరాలా...? అవేమీ లేకపోయినా మేము హాయిగా ఉన్నాం... పిల్లలు బాధ్యతగా బాగా చదువుకుంటున్నారు. నా తండ్రి నాకు చదువునిచ్చారు. అదే చదువు వాళ్ళకూ ఇస్తాను. కోరికల్ని అదుపులో పెట్టుకోవడంలో ఉన్న సుఖం.... పెంచుకోవడంలో లేదు కదా." అన్నాడు.

ఇంతలో శేఖర్ ఒక వైరు బ్యాగూ తెచ్చి "చిన్నాన్నా! బ్యాగు రెడీ... నేనిచ్చిరానా?" అన్నాడు.

"వద్దులే! మీరు చదువుకోండి. తెలియనివి తెల్లవారుజామున చెప్తాను. పదండి. ఇవి... అమ్మకీ వాన్నకీ రాత్రికి గోధుమ రొట్టెలు." అంటూ బయలుదేరాడు నాతో, నేనందరికీ పేరు పేరునా చెప్పి సెలవు తీసుకున్నాను.

గేటు దాటుతూ "ఇంతకీ శాస్త్రి...." అని ఏదో అడగబోతూండగా నీలకంఠమే అందుకుని "శాస్త్రిగారు కుటుంబాన్ని అత్తవారింటికి పంపించి, హెడ్డాఫీసుకు వెళ్లారు. మినిస్టరు కలగజేసుకుంటేగానీ పరిస్థితి చక్కపడదట. తెలిసిన మినిస్టరుని కలవాలని వెళ్ళారు. ఈ ప్రయత్నంలో ఎంతైనా ఖర్చవుతుంది. ఫలితం ఉండకపోదు. ఖర్చు చేసింది రాబట్టుకోడానికి మళ్ళా చేసిన తప్పే చేయాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితి రాకుండా కాపాడవలసింది మీలాంటి వాళ్ళే." అన్నాడు సైకిల్ని ముందుకు నడిపిస్తూ అంతలో ఎవర్నో చూసి ఆగాడు. సంశయిస్తూ... ఓ పాతికేళ్ళ కుర్రాడు ముందుకొచ్చాడు.

"ఎలా ఉంది మీ నాన్నగారికి?" అడిగాడు.

"కొద్దిగా నయంగా ఉందండి. కాకపోతే మందులు ఇంకా వాడాలన్నారు డాక్టరుగారు."

"అలాగా! ఈనెల ఆలస్యమైంది... ఏమనుకోకు. మందులకి మీ నాన్నగారికి ఇయ్యి." అంటూ యాభై నోటు అతని చేతిలో పెట్టాడు నీలకంఠం.

"ఇలా ప్రతి నెలా మీ దగ్గర తీసుకోవడం నాకే కాదు... మా నాన్నగారికి కూడా బాధగా ఉందండి." అన్నాడతను.

"అలాగా! అయితే ఇంత తక్కువ ఇస్తున్నాననే బాధ నాకూ ఉంది. ఏం చేస్తాం చెప్పు. నాన్నగారికి కాస్త ఉపశమనం కలిగేంతవరకు మనకీ బాధలు తప్పవు. మనసులో ఏం పెట్టుకోకు. ముందు పని చూడు." అంటూ నీలకంఠం కదులుతూంటే-

"ఈ అబ్బాయి..."

"మాకు తెలిసిన వాళ్ళబ్బాయి. మా నాన్న, వీళ్ళ నాన్న స్నేహితులు. ఈ అబ్బాయి బి.ఎ. వరకు చదువుకున్నాడు. ఉద్యోగం సరియైనదేదీ లేదు. ఏదో హోటల్‌లో సర్వర్‌గా చేస్తున్నాడు. వీళ్ళేమంత ఉన్న వాళ్లు కారు. వీళ్ళ నాన్నకి ఆస్తమా, క్రానిక్.. అందుకే నాకు తోచిన సహాయం..."

"ఇలా ఎంతకాలం చేస్తారు?"

"నేను బతికి ఉన్నంతకాలం... ఎంతో కొంత... లేనివాళ్ళకు మాత్రమే."

"ఇన్ని ఖర్చులతో ఇదెలా సాధ్యం?" ఎలాగైనా ఇరకాటంలో పెట్టాలని అడిగాను.

"నాకే కాదు. అందరికీ సాధ్యమే. మనసుంటే..."

"కొద్దిగా వివరంగా చెప్పండి."

"సినిమాలు, షికార్లు, బయట కాఫీ, టిఫిన్లు... ఇలాంటి వాటికోసం మనం ఎంతయినా ఖర్చు పెడతాం. ఇది కూడా అలాంటి ఖర్చు అనుకుంటే సాధ్యమే. పై ఖర్చులేవీ నాకు లేవు".

పిసినారికీ పొదుపరికీ మధ్య డివైడింగ్ లైను ఎక్కడ గీయాలో నాకర్థం కాలేదు.

ఒకరి నుండి తీసుకోవడం తప్ప ఇవ్వడం చేతకాని నాకు- ఇది పిసినారితనం అంటే మీరు నవ్వుతారు.

జీతంతోపాటు గీతం తెచ్చుకునే నేను అతన్ని వెర్రివాడిగా తప్ప వేరుగా చూడలేను. బ్యాంకులో సొమ్ము దాచుకునేదే పొదుపు అనుకునే నాకు- అతను ఇతర్లకిచ్చే సాయం పిచ్చిగానే కనిపిస్తుంది.

నాకే కాదు... ఎవరికైనా అనిపించవచ్చు- దూరంగా ఉండి చూసినప్పుడు. కానీ దగ్గరికెళ్తే పరిస్థితి వేరుగా ఉంటుంది. పై మనిషికన్నా లోపలి మనిషినే చూడటం నేర్చుకోవాలనీ... చూడగలిగితే ఎంతయినా నేర్చుకోగలుగుతామనీ... సార్థకమయ్యే జీవితాలు కొన్ని ఉంటాయనీ.. నీలకంఠాన్ని చూశాక నాకర్థమైంది.

చాలా ఆలస్యంగా నాకు తెలిసిన మరో విషయం- నీలకంఠం ఒకప్పుడు శాస్త్రి స్థానంలోనే ఉండి పైసా తీసుకోకుండా పనులు చేస్తూ- అధికార్ల ఆగ్రహంతోనే ప్రస్తుత స్థానానికి వచ్చాడని. శాస్త్రి ఉద్యోగం ఏమయిందో నాకు తెలియదు. కానీ నేనిప్పుడు ఆఫీసుకంటూ వెళ్తే నీలకంఠాన్ని చూడ్డానికే వెళ్తాను.

ఇంకో విషయం... మా అమ్మ నాతోనే ఉంటోంది. ఇక ముందుకూడా మా మధ్యే ఉంటుంది. అందుకే... ఎవరి గురించైనా దూరంగా ఉండి వ్యాఖ్యానించడంకన్నా దగ్గరికెళ్ళి చూడమంటాను. ఎప్పటికీ ఇదే అంటాను.

★ ★ ★